## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

మాకులమ్ము వాడు, మా మతమ్ము ననుచు
మాకు స్నేహితుడను , మమత వీడి
మంచితనము జూచి సంచితముగ నీవు
ఓటు వేయవోయి మేటిగాను

మీ
నలుమాసు విజయప్రసాద్
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 232 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 10-12-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




## తెలంగాణలో చలి పంజా..

- గణనీయంగా పెరిగిన చలి తీవ్రత
- సాధారణంకంటే కనిష్ట ఉష్ణో గ్రతలు నమోదు

హైదరాబాద్- డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : తెలంగాణలో చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3–4 డిగ్రీలు తగ్గాయి. రానున్న నాలుగు రోజులు చలి మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 7.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.దాదాపు అన్ని జిల్లాల్లో కనిష‘ ఉషో?గ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల మేర తగ్గాయి. ముఖ్యంగా సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో రహదారులపై ద ృశ్యత తగ్గి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

-మిగతా 2 లో




# తెలంగాణ మట్టిలోనే గొప్ప చైతన్యం

### 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

- పేదల్లో నిరుపేదలకు సహాయానికే ప్రాధాన్యం
- విజన్ డాక్యుమెంట్-2047 రూపకల్పనలో అందరి భాగస్వామ్యం
- ఆవిష్కరణ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణ మట్టిలోనే గొప్ప చైతన్యం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పేదల్లో నిరుపేదలకు సహాయం చేయడానికే తాము ప్రాధాన్యం ఇస్తామన్నారు. సమాజంలో వివక్షత నిర్మూలన తమ లక్ష్యమని తెలిపారు. మంగళవారం ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో సీఎం రేవంత్ ప్రసంగించారు.

-మిగతా 2 లో




## జపాన్‌లో భారీ భూకంపం

- రిక్టార్ స్కేల్‌పై 7.2 తీవ్రత నమోదు
- భారీగా ఎగసిపడుతున్న రాకాసి అలలు
- సునామీ హెచ్చరికలు జారీ!

హొక్కైడో,
జపాన్ తీరంలో తీవ్ర భూకపం తలెత్తింది.భూకంపం తీవ్రత రిక్టార్ స్కేల్‌పై దాదాపు 7.2గా నమోదైంది. సముద్రం అలలు 10 అడుగుల మేర ఎగసిపడుతున్నాయి. దీంతో అక్కడి ప్రభుత్వం సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ఉత్తర జపాన్ అంతటా సునామీ హెచ్చరికలు జారీ చేయబడ్డాయి. జపాన్ తూర్పు తీరంలో సంభవించిన భారీ భూకంపం కారణంగా సునామీ హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 9.13 గంటల సమయంలో ఈ భూకంపం సంభవించింది. ఇది 30 మైళ్ల కంటే ఎక్కువ లోతులో కేంద్రీకృతమై ఉంది. దీంతో అక్కడి అధికారులు హొక్కైడో, అమోరి, ఇవాటే ప్రిఫెక్చర్ల పసిఫిక్ దీవులకు ముందస్తు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. అయితే యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే మాత్రం దీని తీవ్రత 7.6గా అంచనా వేస్తుంది. ఇది సాధారణంగా రాబోయే పెద్ద భూకంపాన్ని సూచించే సంకేతం. సాధారణంగా ఈ స్థాయి భూకంపాలు తలెత్తితే తీవ్రమైన నష్టాన్ని, గణనీయమైన విధ్వంసాన్ని, ప్రాణ నష్టాన్ని కలిగిస్తాయి. సునామీలు ఎంత వినాశకరమైనవో జపాన్‌కు బాగా తెలుసు. 2011 టోహోలో వచ్చిన భూకంపం, సునామీ విపత్తు చరిత్రలో అత్యంత దారుణమైన విపత్తులలో ఒకటి. దీని వలన 375 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. 20 వేల మంది మరణించినట్లు అంచనా. ఇది ఫుకుషిమా అణు ప్రమాదానికి సమానం.

-మిగతా 2 లో

## రాజ్యాంగాన్ని గుప్పిట్లో పెట్టుకునే కుట్ర



- ఆర్‌ఎస్‌ఎస్ చేతుల్లోకి రాజ్యాంగ వ్యవస్థలు
- సర్‌పై చర్చలో రాహుల్ ఘాటు విమర్శలు

న్యూఢిల్లీ, -
రాజ్యాంగ వ్యవస్థలను చేతుల్లోకి తీసుకోవడమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఎజెండా అని, ఆ ఎజండానే ప్రభుత్వం అమలు చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై మంగళవారం నాడు లోక్‌సభలో జరిగిన చర్చలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ వాదులకు సమానత్వంపై నమ్మకం లేదని, అన్ని వ్యవస్థలపైనా ఆధిపత్యం చూపుతున్నారని విమర్శించారు. ఎన్నికల వ్యవస్థను సైతం ఆర్‌ఎస్‌ఎస్ తన గుప్పిట్లో ఉంచుకుందని ఆరోపించారు. ఇప్పటికే దేశంలోని విద్యావ్యవస్థను మార్చేశారని, దేశంలోని వైవిధ్యాన్ని నాశనం చేస్తున్నారని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకులను ప్రభుత్వం టా÷-గ్గ÷ట్ చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకే ఈసీని వాడుకుంటున్నారని, క్షేత్ర స్థాయిలో ఎన్నికల సంస్కరణలు అమలు కావడం లేదని రాహుల్ ఆరోపించారు. ఈసీ నియామకంలో మోదీ, అమిత్‌షాకు ఎందుకంత ఆసక్తి అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్లకు మోదీ, అమిత్‌షా బహుమతులిస్తున్నారని, సీబీఐ, ఈడీలను ప్రభుత్వం తన గుప్పిట్లో ఉంచుకుందని

-మిగతా 2 లో

## తెలంగాణ టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల

- మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు
- ఒక్కో పరీక్షకు మూడురోజుల గ్యాప్




హైదరాబాద్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. 2026 మార్చి నెల 14వ తేదీ నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలంగాణ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. పరీక్షల నిర్వహణకు సంబంధించి పూర్తి టైమ్‌టేబుల్‌ను విడుదల చేస్తూ, విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 తేదీ


-మిగతా 2 లో




## ఇండిగోకు కేంద్రం గట్టి షాక్

- ఇండిగో షెడ్యూళ్లలో 10 శాతం కోత
- పౌరవిమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడు
- ప్రయాణికుల ఇబ్బందికి చింతిస్తున్నా: సిఇవో

2 లో




## ఈసారి డిజిటల్ విధానంలో జనగణన..

- 2027లో జనగణనకు కేంద్రం సిద్ధం
- లోక్‌సభలో ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
దేశంలో జనాభా లెక్కల సేకరణ స్వరూపం ఈసారి పూర్తిగా మారపోనుంది. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా పేపర్ వాడకుండా డిజిటల్ విధానం లో జనాభా వివరాలను సేకరించబోతున్నారు. ఈ విషయాన్ని మంగళవారం లోక్‌సభ లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వెల్లడించారు.

-మిగతా 2 లో



## కేసీఆర్ అంటే పోరాటం.. రేవంత్ అంటే వెన్నుపోటు


- కేసీఆర్ దీక్షనే లేకపోతే డిసెంబర్ 9 అర్ధరాత్రి చిదంబరం ప్రకటన వచ్చేదా
- దీక్ష చేయకపోతే ఢిల్లీ దిగి వచ్చేదా
- కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం
- తెలంగాణ ఉద్యమ చరిత్ర అంటూ రాస్తే
- రేవంత్‌కు ఉన్న స్థానం ద్రోహం, వెన్నుపోటు
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ ధ్వజం

హైదరాబాద్ - డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
కేసీఆర్ దీక్ష ఫలితంగానే డిసెంబర్ 9 ప్రకటన వచ్చిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ అన్నారు. కేసీఆర్ దీక్షనే లేకపోతే డిసెంబర్ 9 అర్ధరాత్రి చిదంబరం ప్రకటన వచ్చేదా అని ప్రశ్నించారు. దీక్ష చేయకపోతే ఢిల్లీ దిగి వచ్చేదా అని నిలదీశారు. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం అన్నారు. కేసీఆర్ అంటే పోరాటం.. కేసీఆర్ అంటే త్యాగం అని, రేవంత్ (అంటే వెన్నుపోటు.. రేవంత్ అంటే ద్రోహం అని ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర అంటూ రాస్తే రేవంత్‌కు ఉన్న స్థానం ద్రోహం,

-మిగతా 2 లో

# గ్లోబల్ సమ్మిట్ విజయవంతం

### రెండ్రోజులు పాటు అట్టహాసంగా సాగిన సదస్సు



- తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ విడుదల
- సీఎం రేవంత్‌పై ఆనంద్ మహీంద్ర ప్రశంసలు
- విజన్ అద్భుతంగా ఉందన్న మాజీ ఆర్‌బిఐ గవర్నర్ దువ్వూరి

హైదరాబాద్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత వైభవంగా నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' విజయవంతంగా ముగిసింది. రెండురోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా దీనిని నిర్వహించారు. ఈ అంతర్జాతీయ స్థాయి సమ్మిట్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా అండ్ మహీంద్రా చైర్‌పర్సన్ ఆనంద్ మహీంద్రా పాల్గొని సీఎం రేవంత్ రెడ్డిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన అభివృద్ధి దిశ, విజన్ డాక్యుమెంట్ ఆయనను బాగా ఆకట్టుకుందని వెల్లడించారు. సమ్మిట్ వేదికపై మాట్లాడిన ఆనంద్ మహీంద్రా టెక్నాలజీ ఎంత

-మిగతా 2 లో

## భారత్‌లో రూ. 1.5లక్షల కోట్లు పెట్టుబడి

- మైక్రోసాఫ్ట్ సిఈవో సత్య నాదెళ్ల ప్రకటన
- ప్రధాని మోడీతో భేటీలో పలు అంశాలపై చర్చ
- స్వాగతించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,
మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల మంగళవారం ప్రధాని నరేంద్రమోడీతో భేటీ అయ్యారు. ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడిన ఇండియాలో పెడుతున్నట్లు సత్య నాదెళ్ల ప్రకటించారు. ఇది భారతదేశ ఆశయాలకు మద్దతు ఇస్తుందని చెప్పారు. భారతదేశ ఎఐ ఫస్ట్ ఫ్యూచర్' నిర్మించేందుకు, డెవలప్ చేసేందుకు శ్రీ17.5 బిలియన్లు అంటే రూ. 1.5 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టడానికి కట్టుబడి ఉన్నట్లు వెల్లడించారు. భారతదేశం ఎఐ అవకాశంపై స్ఫూర్తిదాయకమైన సంభాషణలకు సత్యానాదెళ్ల ప్రధాని నరేంద్రమోడీకి థాంక్స్ చెప్పారు. ఆసియాలోనే మైక్రోసాఫ్ట్ అతిపెద్ద పెట్టుబడి లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. మోడీతో మీటింగ్ గురించి నాదెళ్ల ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'భారతదేశ ఏఐ అవకాశంపై స్ఫూర్తిదాయకమైన సంభాషణలకు ప్రధాని నరేంద్రమోడీకి ధన్యవాదాలు, దేశ ఆశయాలకు మద్దతు ఇవ్వడానికి, ఇండియా ఏఐ ఫస్ట్ ఫ్యూచర్‌కు అవసరమైన



-మిగతా 2 లో

## జపాన్‌లో భారీ భూకంపం

మొదటి తరువాయి

అంతర్జాతీయ అణు సంఘటన స్కేల్‌లో చెర్నోబిల్‌తో పాటు ఏడవ రేటింగ్ పొందిన ఏకైక సంఘటన ఇది. ఈ ప్రమాదం పరిణామాలు కనీసం 2051 వరకు కొనసాగుతాయని భావిస్తున్నారు.

## తెలంగాణలో చలి పంజా..

మొదటి తరువాయి

నిర్మల్ జిల్లా పెంబి మండలం చింతగూడకు చెందిన 60 ఏళ్ల వృద్ధుడు గంగారెడ్డి చలి తీవ్రతకు బలవ్వడం ఈ పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రానున్న రోజుల్లో చలి ప్రభావం మరింత ఎక్కువ అవుతుందని చెప్పారు. ముఖ్యంగా వచ్చే నాలుగు రోజులు (డిసెంబర్ 10, 11, 12, 13) చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలోనే అత్యల్ప కనిష‘ ఉషో?గ్రత సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 7.2 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి ప్రభావం అధికంగా ఉన్నప్పటికీ, దక్షిణ తెలంగాణలోని కొన్ని జిల్లాల్లోనూ చలిగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈనెల 16 వరకు చలిగాలుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని అంచనా వేశారు. ముఖ్యంగా జగిత్యాల, సంగారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, వికారాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్ధిపేట, రంగారెడ్డి ఉన్నాయి.ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ నగరంలోనూ చలి తీవ్రత పెరగనుందని, ఇక్కడ కనిష్ట ఉషో?గ్రతలు 9 డిగ్రీల సెల్సియస్ నుంచి 12 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతాయని అంచనా వేస్తున్నారు. వృద్ధులు, పిల్లలు తప్పనిసరిగా వెచ్చటి దుస్తులు ధరించాలని, అత్యవసరమైతే తప్ప ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు రాకుండా ఉండాలని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ప్రజలు చలి నుంచి రక్షణ కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వెచ్చటి దుస్తులు ధరించాలని, వేడి వేడి భోజనం చేయాలని తెలిపారు.

## రాజ్యాంగాన్ని గుప్పిట్లో పెట్టుకునే కుట్ర

మొదటి తరువాయి

ఆరోపణలు గుప్పించారు. కేంద్రం, ఎన్నికల సంఘం కుమ్మక్కయ్యాయని, తాను నిజాలు మాట్లాడుతుంటే బీజేపీ జీర్ణించుకోలేక పోతోందని అన్నారు. తాను ఏదీ తప్పుగా మాట్లాడలేదని, పూర్తి ఆధారాలతోనే మాట్లాడుతున్నానని చెప్పారు. ఎన్నికల సంస్కరణలపై కేంద్రం గొప్పలు చెప్పుకుంటోందని రాహుల్ విమర్శించారు. ఉత్తరప్రదేశ్, హరియాణాలో పలు చోట్ల 'ఓట్ చోరీ' జరిగిందన్నారు. ఎన్నికల సీసీ ఫుటేజ్‌ను ధ్వంసం చేశారని, ఫేక్ ఓట్లపై ఈసీ క్లారిటీ ఇవ్వలేదని చెప్పారు. తాను అడిగిన ప్రశ్నలకు ఇప్పటికీ ఈసీ సమాధానం ఇవ్వలేదని అన్నారు.

## తెలంగాణ టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల

మొదటి తరువాయి

వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఎస్ఎస్‌సీ బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 14న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకెండ్ లాంగ్వేజ్, 23న ఇంగ్లీష్, 28న గణితం, ఏప్రిల్ 2న ఫిజిక్స్, ఏప్రిల్ 7న బయాలజీ, ఏప్రిల్ 13న సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 15న ఒకేషనల్ కోర్సు పేపర్-1 భాషా పీరీక్ష, ఏప్రిల్ 16న ఒకేషనల్ కోర్సు పేపర్-2 భాషా పరీక్ష జరగనుంది. ఈ షెడ్యూల్ ప్రకారం ప్రతి పరీక్షకు మధ్య మూడు రోజుల గ్యాప్‌ను కల్పించారు. దీని ద్వారా విద్యార్థులు ఒక పరీక్ష నుంచి మరో పరీక్షకు సమగ్రంగా సిద్ధమయ్యే అవకాశం ఉంటుందని బోర్డు పేర్కొంది. గతంలో ఒకటి లేదా రెండు రోజుల గ్యాప్‌తో పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఆ పరిస్థితిని దృష్టిలో ఉంచుకునే ఈసారి గ్యాప్‌ను పెంచామని అధికారులు వెల్లడించారు. మార్చి 14న మొదటి భాష పరీక్షతో ఎస్ఎస్‌సీ పరీక్షలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత రెండో భాష, మూడో భాష (ఆంగ్లం), గణితం, సైన్స్ (ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్), సామాజిక శాస్త్రం పరీక్షలు వరుసగా నిర్వహిస్తారు. ఏప్రిల్ 13న చివరిగా సోషల్ స్టడీస్ పరీక్షతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగియనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎక్కువ భాగం పరీక్షలు జరుగుతాయని బోర్డు స్పష్టం చేసింది. సైన్స్ అంశాలకు సంబంధించిన పరీక్షలకు నిర్ణీత సమయం కొద్దిగా భిన్నంగా ఉంటుందని అధికారులు తెలియజేశారు. వృత్తి విద్య (వొకేషనల్) విద్యార్థులు, ఓపెన్ స్కూల్ విద్యార్థులకు కూడా ఇదే షెడ్యూల్ వర్తిస్తుందని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని బోర్డు అధికారులు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రశ్న పత్రాల గోప్యతకు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## భారత్‌లో రూ. 1.5లక్షల కోట్లు పెట్టుబడి

మొదటి తరువాయి

మౌలికసదుపాయాలు, నైపుణ్యాలు, సామర్థ్యాలను నిర్మించడంలో సహాయపడటానికి 17.5 బిలియన్ల పెట్టుబడి నిబద్ధతకు కట్టుబడి ఉన్నామని అన్నారు.గూగుల్, అమెజాన్ కూడా భారత్‌లో డేటా సెంటర్లు, ఏఐ హబ్‌ల ఏర్పాటులో బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించాయి. అక్టోబర్‌లో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఏపీలోని విశాఖపట్నంలో ఏఐ హబ్ కోసం 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికను వెల్లడించారు. ప్రముఖ టెక్నాలజీ సంస్థ మైక్రోసాఫ్ట్ భారత్‌లో భారీ పెట్టుబడి పెట్టనుంది. భారత్ తన ఏఐ లక్ష్యాలను చేరుకోవడానికి 17.5 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టనున్నట్లు కంపెనీ సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటించారు. ప్రధాని నరేంద్రమోదీతో మంగళవారం భేటీ అయిన ఆయన.. ఈ పెట్టుబడి గురించి ఎక్స్ వేదికగా ప్రకటన చేశారు. భారత్‌లో ఏఐ అవకాశాలపై స్ఫూర్తిదాయక సంభాషణ తమ మధ్య జరిగిందని పేర్కొంటూ ప్రధాని మోదీతో ఉన్న చిత్రాన్ని పోస్ట్ చేశారు. దేశ ఏఐ ఆశయాలకు మద్దతుగా పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టనున్నట్లు సత్యానాదెళ్ల ప్రకటించారు. ఇది ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడి అని పేర్కొన్నారు. భారత్‌లో కృత్రిమ మేధ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు, సామర్థ్యాలను అందించేందుకు ఈ నిధులను వినియోగిస్తామన్నారు. రాబోయే నాలుగేళ్లలో (2026-29) మధ్య ఈ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ తన ప్రకటనలో పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన 3 బిలియన్ డాలర్లకు ఈ పెట్టుబడి అదనమని తెలిపింది. మైక్రోసాఫ్ట్ పెట్టుబడి ప్రకటనపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## ఈసారి డిజిటల్ విధానంలో జనగణన..

మొదటి తరువాయి

డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రెండు మొబైల్ యాప్‌లను, ఒక వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. రెండు యాప్‌లలో ఒకటి జనాభా లెక్కలు సేకరించే వారి కోసం కాగా.. మరొకటి పౌరుల కోసం తయారు చేశారు. గతంలో జనాభా వివరాలు సేకరించాలంటే ఒక వ్యక్తి నుంచి 30 చొప్పున ప్రశ్నలు అడిగాల్సి వచ్చేంది. కానీ ఇప్పుడు ప్రశ్నలతో యాప్‌లను రూపొందించారు. జనగణకులు తమ యాప్‌లో పౌరుల వివరాలను ఎంట్రీ చేస్తారు. ఆసక్తి ఉన్న పౌరులు వారి కోసం సిద్ధం చేసిన యాప్ ద్వారా నేరుగా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. పౌరులు నమోదు చేసుకున్న వివరాలను జనగణకులు ఇంటికి వచ్చి పరిశీలిస్తారు. ఈ విధానం ద్వారా జనగణన కోసం ఎక్కువ సమయం వెచ్చించాల్సిన అవసరం తప్పుతుంది. మన దేశంలో సాధారణంగా ప్రతి 10 సంవత్సరాలకు ఓసారి జనాభా లెక్కలను సేకరిస్తారు. చివరిసారిగా 2011లో జనగణన జరిగింది. కరోనా కారణంగా 2021లో జనగణన వాయిదా పడింది. ఈ క్రమంలో 2027లో జనగణనకు కేంద్రం సిద్ధమైంది.

# తెలంగాణ మట్టిలోనే గొప్ప చైతన్యం

మొదటి తరువాయి

విజన్ డాక్యుమెంట్-2047 రూపకల్పనలో అందరి భాగస్వామ్యం ఉందన్నారు. నీతి ఆయోగ్, ఐఎస్‌బీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ప్రజలు భాగమయ్యారన్నారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకే.. తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047 రూపొందించామని చెప్పారు.విద్య కోసం ఖర్చు చేసేది వ్యయం కాదని పెట్టబడి అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యలో నాణ్యతతోపాటు నైపుణ్యాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనిక పత్రం, రాబోయే రెండు దశాబ్దాల్లో రాష్ట్రాన్ని సమగ్రంగా, సమ్మిళితంగా సుస్థిరంగా అభివృద్ధి చేసే దిశగా భవిష్యత్తు కు బాటలు వేసే దార్శనిక పత్రం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ అని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను ఆవిష్కరించే బృహత్తరమైన ప్రయత్నంలో భాగమే తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ రూపొందించామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉజ్జ్వల భవిత కోసం..ప్రజల భవిష్యత్తు కోసం.. భావి తరాల కోసం.. ముందుచూపుతో 'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్ రూపుదిద్దుకుందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఈ డాక్యుమెంట్ తయారు చేసింది. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల అభిప్రాయాలు..




ఆకాంక్షలకు ఇందులో చోటు కల్పించింది. అన్ని శాఖల మంత్రులు, అన్ని విభాగాల అధికారులు, మేధావులు, అన్ని రంగాల నిపుణులు, పారిశ్రామికవేత్తలు, సామాజిక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సలహాలకు ప్రాధాన్యమిచ్చింది. ఈ డాక్యుమెంట్ తయారీలో నీతి ఆయోగ్ కీలక భూమిక నిర్వహించింది. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్లు డాక్యుమెంట్ తయారీలో పాలుపంచుకున్నారు. వరుస సంప్రదింపులు, రోజుల తరబడి చర్చలు, ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ప్రముఖుల సలహాలు, సూచనలు, వివిధ దేశాలు అనుసరిస్తున్న ఆదర్శవంతమైన విధానాలన్నింటినీ ప్రభుత్వం అధ్యయనం చేసింది. వీటన్నింటినీ విశ్లేషించుకొని.. వడపోసి.. తెలంగాణ భవిష్యత్తు ఎలా ఉండాలో ఈ దార్శనిక పత్రంలో పొందుపరిచింది. ఇందులో ఉన్న ప్రతి అధ్యాయం తెలంగాణ పురోగాభివృద్ధికి దోహదపడుతుంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా వృద్ధి చేయడం తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ విజన్ ప్రధాన లక్ష్యం. దీంతో తెలంగాణ అభివృద్ధిలో ప్రపంచ దేశాలకు ధీటుగా నిలబడి.. దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఒకటిగా నిలుస్తుంది.రాష్టం నలుమూలల అన్ని జిల్లాల నుంచి దాదాపు 4 లక్షల మంది ఆకాంక్షలు.. అభిప్రాయాలతో ఈ డాక్యుమెంట్ రూపొందించారు. 65 శాతం యువత ఈ ఉజ్వల తెలంగాణ భవిష్యత్ రూపకల్పన లో పాలుపంచుకున్నారు.అదునాతన సాంకేతికత, కొత్త ఆవిష్కరణలు, సమర్థవంతమైన ఆర్థిక వనరులతో పాటు సుపరిపాలన ఈ ఆర్థిక వృద్ధికి ఉత్ప్రేరకంగా పని చేస్తాయి. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి మూడు-జోన్ల అభివృద్ధి నమూనాను ఈ డాక్యుమెంట్ కీలకంగా ప్రస్తావించింది. హైదరాబాద్ సిటీ తో పాటు పరిసర ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల మధ్య సమతుల్య, పరస్పర ఆధారిత వృద్ధిని సాధించే సంకల్పం. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలనే మైలు రాయి ని నిర్దేశిరచింది. 2047 నాటికి జాతీయ జిఎస్‌డిపిలో తెలంగాణ వాటా పదో వంతు కు చేరాలని లక్ష్యంగా ఎంచుకుంది. పెట్టుబడులకు గమ్యస్థానంగా, ఆవిష్కరణలకు కేంద్రంగా తెలంగాణను ప్రపంచ స్థాయి మౌలిక వసతులున్న అత్యాధునిక రాష్ట్రంగా తీర్చిదిద్దటం. అన్ని వర్గాలకు సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించే ఆదర్శవంతమైన రాష్ట్రంగా నిలబెట్టడం లక్ష్యంగా ఈ డాక్యుమెంట్ రూపొందింది. ఆనంద్ మహీంద్రా తదితరుల సమక్షంలో దీనిని సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.

# గ్లోబల్ సమ్మిట్ విజయవంతం

మొదటి తరువాయి

వేగంగా ఎదిగినా, డిజిటలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత విస్తరించినా హ్యూమన్ టచ్‌కు ఉన్న ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదన్నారు. మానవీయ నైపుణ్యాన్ని ఏ సాంకేతికత భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా హ్యూమన్ స్కిల్స్‌కు కీలక పాత్ర ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను పరిశీలించిన తర్వాత లక్ష్యాలను మరింత విస్తృతంగా, పెద్ద స్థాయిలో పెట్టుకోవాలని అనిపించిందని ఆనంద్ మహీంద్రా తెలిపారు. ఆ డాక్యుమెంట్‌ను చూస్తే నిపుణుల అభిప్రాయాలు మాత్రమే కాకుండా, తెలంగాణ ప్రజల ఆశయాలు కూడా ప్రతిబింబించినట్లు అనిపించిందన్నారు. యువత, మహిళలు, సమగ్ర అభివృద్ధి వంటి అంశాలు సమతుల్యంగా ఇందులో పొందుపరిచినట్లు ప్రశంసించారు. ఇంత స్ఫూర్తి దాయకమైన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆనంద్ మహీంద్రా ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం స్పష్టమైన దిశ, ధైర్యమైన లక్ష్యాలతో ముందుకు వెళ్తున్న నాయకత్వం తెలంగాణలో కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. జహీరాబాద్‌లో మహిళలు నిర్వహిస్తున్న బ్యాటరీ తయారీ పరిశ్రమ తమకు గర్వకారణమని ఆనంద్ మహీంద్రా చెప్పారు. మహిళా సాధికారత, పారిశ్రామిక అభివృద్ధి రెండూ కలిసొచ్చేలా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. నాలుగు దశాబ్దాలుగా వ్యాపార రంగంలో ఉన్న తన అనుభవంతో చూస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు ఒక సమఉజ్జీలా కనిపిస్తున్నారని ఆనంద్ మహీంద్రా వ్యాఖ్యానించారు. భవిష్యత్తు తెలంగాణ నిర్మాణంలో ఈ తరహా నాయకత్వం కీలకంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో అన్ని సెషన్లు ముగిశాయి. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్-2047' డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా, అగ్రనటుడు చిరంజీవి, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. దీర్ఘకాలిక లక్ష్యాలతో డాక్యుమెంట్‌ను రూపొందించారని కితాబిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి దార్శనికతకు అభినందనలు తెలిపారు. 'స్కిల్ యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉండాలని మొదట సీఎం నన్ను అడిగారు. అప్పటికే టెక్ మహీంద్రా యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉన్నందున వద్దని చెప్పాను. అయితే, ఆయన లక్ష్యాలు, విజన్ విన్నాక తిరస్కరించలేకపోయాను. తెలంగాణ రైజింగ్ విజన్ బ్లూప్రింట్ చూశాను. ప్రజలు కేంద్రంగా దీన్ని రూపొందించారని అన్నారు. తెలంగాణ గొప్ప అభివృద్ధి సాధిస్తోందని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. దేశంలోనే వృద్ధిరేటు ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా నిలిచిందన్నారు. 'హైదరాబాద్ ఐకానిక్ నగరంగా నిలిచింది. ప్రపంచస్థాయి కంపెనీలకు ఇప్పుడు గమ్యస్థానంగా ఉంది. నీతి ఆయోగ్ లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఉంది. దేశంలోనే వృద్ధిరేటు ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఏటా 8-9 శాతం వృద్ధి సాధిస్తే.. తెలంగాణ తన లక్ష్యాలను అందుకోగలదు ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీకి హబ్‌గా హైదరాబాద్ నిలిచింది. భౌతిక మౌలిక వసతులతోపాటు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెరగాలి. చైనా గ్వాంగ్‌డాంగ్ నమూనాను తెలంగాణ ప్రభుత్వం ఎంచుకుంది. తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్ మాత్రమే కాదు.. అన్ బీటబుల్ అని సుబ్బారావు పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌కు విభిన్న ఆలోచనలతో వచ్చిన అందరికీ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు. అందరి సూచనలు, ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామన్నారు. 'తెలంగాణ భవిష్యత్తుకు ఈ డాక్యుమెంట్ ఒక దిక్సూచి. డాక్యుమెంట్ రూపకల్పనలో అన్ని రంగాల మేధావుల సలహాలు తీసుకున్నాం. రాష్ట్రంలో డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు కూడా ప్రాధాన్యం ఇస్తాం' అని చెప్పారు.

## ఇండిగోకు కేంద్రం గట్టి షాక్

### ఇండిగో షెడ్యూళ్లలో 10 శాతం కోత
### పౌరవిమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడు
### ప్రయాణికుల ఇబ్బందికి చింతిస్తున్నా: సిఇవో




న్యూఢిల్లీ,

దేశవ్యాప్తంగా ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఇండిగోకు కేంద్రం గట్టి షాక్ ఇచ్చింది. ఇండిగో షెడ్యూళ్లలో 10 శాతం కోత విధిస్తున్నట్టు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. తద్వారా విమాన సేవలను స్థిరీకరించడం సాధ్యమవు తుందన్నారు. ఇండిగో సేవలపై వివరణ కోరేందుకు సీఈఓ పీటర్ ఎల్బర్స్‌కు మంగళవారం పౌరవిమానయాన శాఖ సమన్లు జారీ చేసింది. ఈ భేటీ అనంతరం మంత్రి తన నిర్ణయం ప్రకటించారు. ఇండిగో అంతర్గత నిర్వహణలో వైఫల్యం, విమాన షెడ్యూళ్లు, కమ్యూనికేషన్ సరిగా లేకపోవడం వల్ల చాలా మంది ప్రయాణికులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈలోగా సంస్థ కార్యకలాపాలను సమీక్షించేందుకు మరోసారి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించినట్లు నాయుడు తెలిపారు. డిసెంబర్ 6 వరకు ప్రభావితమైన విమానాలకు టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు నూరు శాతం రిఫండ్లు పూర్తి చేసినట్లు ఇండిగో సీఈఓ మంత్రికి వివరించగా.. మిగిలిన మొత్తాలను కూడా త్వరగా వాపస్ చేయాలని ఆదేశించారు. ఇండిగో సేవల్లో ఈ పరిస్థితి తలెత్తకుండా అన్ని మార్గాల్లో విమాన సర్వీసులను తగ్గించాలని నిర్ణయానికొచ్చినట్లు మంత్రి తెలిపారు.

## కేసీఆర్ అంటే పోరాటం..
## రేవంత్ అంటే వెన్నుపోటు

మొదటి తరువాయి

వెన్నుపోటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి అని చెప్పారు. తెలంగాణ భవన్‌లో విజయ్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్ రావు.. తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. 'డిసెంబర్ 9 అనేది చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. నవంబర్ 29న దీక్షా దివస్ జరుపుకున్నాం. నవంబర్ 29 లేకపోతే డిసెంబర్ 9 తెలంగాణ ప్రకటన లేదు. డిసెంబర్ 9 లేకపోతే జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం లేదు. తెలంగాణ ఉద్యమంలో ఈ 3 రోజులు చాలా కీలకమైనవి.నిమ్స్‌లో కేసీఆర్ 11 రోజులు ఆమరణ దీక్ష దేశారు. కేసీఆర్ దీక్ష ఫలితం డిసెంబర్ 9న ప్రకటన వచ్చింది. కేసీఆర్ దీక్షనే లేకపోతే డిసెంబర్ 9 అర్ధరాత్రి చిదంబరం ప్రకటన వచ్చేదా?. దీక్ష చేయకపోతే ఢిల్లీ దిగి వచ్చేదా?. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితం తెలంగాణ రాష్ట్రం. దీక్ష లేకపోతే తెలంగాణ ప్రకటనే రాదు. ప్రకటన వచ్చిందంటే కేసీఆర్ పోరాటం, దీక్ష ఫలితం. కేసీఆర్ అంటే పోరాటం.. కేసీఆర్ అంటే త్యాగం. రేవంత్ అంటే వెన్నుపోటు.. రేవంత్ అంటే ద్రోహం. రాజీనామాలు చేయాలంటే జీరాక్స్‌లు ఇచ్చిన వ్యక్తి రేవంత్ రెడ్డి. జై తెలంగాణ అంటే తుపాకీతో కాలుస్తా అని రైఫిల్ పట్టుకున్న వ్యక్తి రేవంత్. తెలంగాణ ఉద్యమ చరిత్ర అంటూ రాస్తే రేవంత్‌కు ఉన్న స్థానం ద్రోహం, వెన్నుపోటు. ఈ రోజు తెలంగాణ తల్లిని మారుస్తున్నారు. రేవంత్ సృష్టించిన తల్లిని పెడుతున్నారు. తెలంగాణ ఉద్యమం, భావోద్వేగాల మధ్య పుట్టిన తల్లి తెలంగాణ తల్లి. తెలంగాణ తల్లిని ఊరూరా ప్రజలే పెట్టుకున్నారు. తెలంగాన ఉద్యమంలో పుట్టిన తల్లిని మార్చే హక్కు రేవంత్‌కు లేదు. రేవంత్ తెలంగాణ ప్రజల తలరాతలు మారుస్తా అన్నాడు. ప్రజల తలరాతలు మార్చలేదు కానీ, తెలంగాణ తల్లిని మాత్రం మార్చాడు. ఎరువులు, విత్తనాల కొరత సృష్టించాడు. ధరలు పెంచాడు. రైతుబంధు ఎగ్గొట్టాడు. రైతుబీమాకు డబ్బులు కట్టలేదు. మహిళలను ఆగం చేశాడు. రాష్ట్రాన్ని ఆగం చేశాడు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నాడు. రవీంద్రభారతి అవార్డుల కంటే రామోజీ ఫిలింసిటీ అవార్డు గొప్పదని అంటున్నాడు. రవీంద్రభారతిలో దాశరథి, కాళోజీ, గద్దరన్న అవార్డులు ఇస్తారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి. హైదరాబాద్‌కు ట్రంప్ రోడ్డు అని పేరు పెడుతాడంటా. తెలుగు పిల్లలను జైళ్లలో వేసినందు ట్రంప్ పేరు పెడతావా?. మన దేశాన్ని ఇబ్బంది పెట్టి వ్యాపార సంస్థలు మూతపడి, పిల్లల ఉద్యోగాలు ఊడగొట్టినందుకు ట్రంప్ పేరు పెడుతావా?. హైదరాబాద్ పిల్లలు ఉద్యోగాలు రాక అమెరికాలో నానా ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ట్రంప్ ఫీజులు పెంచారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్లగొండ, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** మంగళవారం ఆమె కనగల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. అలాగే సాయిరాం ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను సందర్శించి అక్కడ కావలసిన పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రాల వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. ఓటరు జాబితా వివరాలు సరిగా ఉన్నాయో లేదో తనిఖీచేసుకోవాలన్నారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. బ్యాలెట్ బాక్స్ లు అన్ని ఓపెన్ అవుతున్నాయో లేదో చెక్ చేసుకోవాలని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరో సారి నిర్ధారణ చేసుకోవాలన్నారు.సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కల్పించాలని, చివరిగా ఉన్న పోలింగ్ కేంద్రాల కు ముందుగా బస్సుల ను పంపించాలని చెప్పారు. విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు.ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని,త్రాగునీరు, మూత్రశాలలు, లైటింగ్ ,పార్కింగ్ ప్రదేశాలు, వచ్చిపోయే దారులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి , ,తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, ఎంఈఓ పద్మ కలెక్టర్ వెంట ఉన్నారు.


ఱి.నెం. 22/2005

తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్

జర్నలిస్ట్స్ ఫర్ ద పీపుల్

సంస్థలో చేరే సభ్యులకు

- తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ లో సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్క జర్నలిస్టుకు 5 లక్షల రూపాయల ఉచిత జీవిత బీమా.
- సభ్యుల పిల్లలకు పాఠశాల ఫీజుల్లో రాయితీకి కృషి.
- జర్నలిస్టుల నైపుణ్య వికాసానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రత్యేక శిక్షణ తరగతులు.
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న జర్నలిజంపై జర్నలిస్టులకు అవగాహన కల్పించడం సంస్థ లక్ష్యం.
- జర్నలిస్టుల హక్కుల కోసం సంస్థ నిరంతర పోరాటం చేస్తుంది.
- సభ్యులకు ప్రత్యేక లీగల్ సెల్.

టీజేఏ సంస్థలోని సభ్యులకు వారి కుటుంబసభ్యులకు సంవత్సరానికి ఒక సారి ఉచిత వైద్య పరీక్షలు.

సభ్యత్వ రుసుము - 200/- రూపాయలు మాత్రమే

సభ్యత్వాల కోసం సంప్రదించగలరు

ప్రదీప్ కుమార్
జనరల్ సెక్రెటరీ
తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్
మొబైల్ నం: 94403 35887

నిడిగొండ శ్రీరామ్
రాష్ట్ర అధ్యక్షులు
తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్
మో.నం : 81793 50507


# సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా



**హనుమకొండ, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యురాలు సోనియా గాంధీ 79వ జన్మదిన వేడుకలు హనుమకొండ డీసీసీ భవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి శాసన మండలి సభ్యుడు బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కేయూడీఏ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొదట కేక్ కట్ చేసి హనుమకొండ, వరంగల్ ప్రజల తరఫున శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సోనియా గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ప్రధానమంత్రి పదవిని వదులుకుని దేశ ప్రయోజనాలను ముందుకు పెట్టిన నాయకురాలని అన్నారు. రూపాయి పతనం, ఇండిగో విమానాల రద్దు వంటి సమస్యలపై బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నెహ్రూను విమర్శించడం సరికాదని వ్యాఖ్యానించారు.ఈ వేడుకలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు బొద్దిరెడ్డి ప్రభాకర్, ఇ.వి. శ్రీనివాస్ రావు, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళతో పాటు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. తరువాత 51వ డివిజన్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో కూడా వేడుకలు నిర్వహించి కాంగ్రెస్ జెండా ఎగురవేశారు. స్థానికంగా అరటిపండ్లు పంపిణీ చేశారు.

# బిఆర్ఎస్ నాయకుడు బీజేపీలో చేరిక



**హుజురాబాద్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గ్రామాల అభివృద్ధి పట్ల కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చిత్తశుద్ధి లేదని, ఆ పార్టీల అభ్యర్థులకు ఓటు వేయడం గ్రామాభివృద్ధిని వ్యతిరేకించినట్టేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. హుజురాబాద్ రూరల్ మండలం అధ్యక్షుడు రాముల కుమార్ ఆధ్వర్యంలో సిర్సపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు తూముల వెంకట్ రావు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి కాషాయ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని, ఇప్పుడు ప్రజావిశ్వాసం కోల్పోయి మునిగిపోయే నావలా మారిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కూడా అడ్డగోలు హామీలతో ప్రజలను మోసం చేసిందని, గ్రామాలకు నిధులు ఇవ్వకుండా ఎన్నికలకు వెళ్ళిందని ఆరోపించారు. జరగబోయే ఎన్నికల్లో గ్రామీణ ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. బీజేపీలో చేరిన వెంకట్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి తనను ఆకర్షించిందని, సిర్సపల్లి గ్రామంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, బీజేవైయం రాష్ట్ర నేతలు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రణవ్ పర్యటన



**హుజురాబాద్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమయ్యేది పనిచేసే వారిని గెలిపించినప్పుడే అని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. కమలాపూర్ మండల పరిధిలోని భీంపల్లి, శనిగరం, మాదన్నపేట, లక్ష్మీపూర్, నేరేళ్ల, గూనిపర్తి గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు డప్పు చప్పుళ్లతో, మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ప్రణవ్ మాట్లాడుతూ గత రెండేళ్లలో హుజురాబాద్ అభివృద్ధి కోసం ఏం జరిగిందో ప్రజలు గమనించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పెంపు వంటి పథకాలు అమలవుతున్నాయని వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల్లో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలను కోరారు. సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా ఆమెను తెలంగాణ తల్లిగా అభివర్ణిస్తూ ప్రణవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

# సంగారెడ్డిలో లైబ్రరీ ప్రారంభోత్సవం, బీజేపీలో చేరికలు



**సంగారెడ్డి, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రామచంద్రపురం పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో కొత్త లైబ్రరీని ఏర్పాటు చేసి ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ సి. అంజిరెడ్డి, పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరయ్యారు. లైబ్రరీ కేవలం పుస్తకాల గది మాత్రమే కాకుండా, అది విజ్ఞానం, సృజనాత్మకత, అవకాశాల ప్రపంచానికి ద్వారం అని ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రేరణ కలిగించేలా ఈ లైబ్రరీ రూపకల్పన చేయబడిందని తెలిపారు.అదే రోజు సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం పుల్కల్ పట్టణ మాజీ సర్పంచ్ శ్రవణ్ కుమార్ తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. ఎమ్మెల్సీ అంజి రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, ఇతర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# పాక్‌లో ఊపందుకున్న సింధూ దేశ్ డిమాండ్

## హింసాత్మకంగా ప్రత్యేక దేశం ఆందోళన

**న్యూఢిల్లీ – డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పాకిస్థాన్‌లో ప్రత్యేక సింధూ దేశ్ ఉద్యమం ఉధృతంగా మారుతున్నది. కరాచీలో గత ఆదివారం నుంచి జరుగుతున్న ఆందోళనలు హింసాత్మకంగా మారుతున్నాయి. ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతోపాటు విధ్వంసానికి దిగుతున్నారు. సింధీ సంస్కృతి దినోత్సవం సందర్భంగా ఆదివారం సింధూ దేశ్ ఉద్యమం ప్రారంభమైంది. 'జియే సింధ్ ముత్తాహిదా మహజ్' సంస్థ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో వచ్చిన ఆందోళనకారులు 'మాకు స్వాతంత్ర్యం కావాలి', 'పాకిస్థాన్ ముర్దాబాద్' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

# గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు కోరిన సుడా చైర్మన్



**కరీంనగర్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోవాలని, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లోని పది గ్రామాల్లో ఆయన సుడిగాలి పర్యటన చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచులను మోసం చేసి, నిధులు ఇవ్వకుండా అవమానించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సర్పంచ్‌లకు పెద్దపీట వేసి, రాష్ట్ర నిధులతో పాటు సుడా తరపున ప్రత్యేక నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధి చేస్తుందని తెలిపారు. బిఆర్ఎస్ అభ్యర్థులను నమ్మొద్దని, రెండేళ్ల ప్రజాపాలనను చూసి కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ



**పెద్దపల్లి, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సబ్బండ వర్గాల ఆకాంక్షలకు ప్రతిబింబంగా, ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా తెలంగాణ తల్లి విగ్రహం పెద్దపల్లి కలెక్టరేట్ ఆవరణలో రూపుదిద్దుకుంది. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి మంగళవారం ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 60 ఏళ్ల ప్రజా పోరాటాల ఫలితంగా డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై మొదటిసారి సానుకూల ప్రకటన చేసిన రోజును స్మరించుకుంటూ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందకరమని తెలిపారు. రాష్ట్ర సచివాలయం తో పాటు ప్రతి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం సంప్రదాయాలు, సంస్కృతి, పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా రూపుదిద్దుకున్నదని, ఆమె చేతిలో కొడవలి, పోత్తం తెలంగాణ సంపదకు సూచకమని వివరించారు. విగ్రహం పాదాల వద్ద పల్లె బతుకులు, జానపద సంస్కృతి ప్రతీకలు ప్రతిఫలిస్తున్నాయని తెలిపారు. ప్రజల త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తి, సాంస్కృతిక వారసత్వాన్ని శాశ్వతంగా నిలబెట్టే చిహ్నంగా ఈ విగ్రహం నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. విగ్రహ ప్రాంతాన్ని ప్రజలను ఆకట్టుకునేలా అభివృద్ధి చేస్తున్నామని, పనుల నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారుల పర్యవేక్షణలో నిర్మాణం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిపాలన అధికారి బి. ప్రకాష్, ఆర్ అండ్ బి ఈఈ బావ్ సింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాకతీయ యూనివర్సిటీలో మానవహక్కుల దినోత్సవభ



**హుస్నాబాద్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 10న హన్మకొండ కాకతీయ యూనివర్సిటీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో సర్వసభ్య సమావేశం జరగనుంది. ప్రతి మానవుడికి సహజంగా లభించే మానవ హక్కులపై అవగాహన పెంపొందించడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జి కె. పట్టాభి రామారావు, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి చంద్ర కుమార్, సమాచార హక్కు చట్టం మాజీ జాతీయ కమిషనర్ డాక్టర్ మాడబుషి శ్రీధర్, యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపల్ పసునూరి అమరవేణి, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, పొలిటికల్ అనాలిస్టు వి. ప్రకాష్, ఎన్ఎచ్ఆర్సి ఎన్జీవో వ్యవస్థాపకుడు, జాతీయ చైర్మన్ ఐలేని శ్రీనివాస్ రావు పాల్గొననున్నారు. సభ విజయవంతం కావడానికి సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు పెందోట భూశంకరచారి, ఉపాధ్యక్షులు పోలోజు రవీందర్, అదనపు ప్రధాన కార్యదర్శి కట్కోజ్వాల భూశంకర్, కోఆర్డినేటర్ వరయోగుల వెంకటేశ్వర్లు, లీగల్ అడ్వైజర్ ఇల్లెందుల తిరుపతి, కన్వీనర్ సొల్లేటి ఆంజనేయులు, సోషల్ మీడియా కన్వీనర్ జాల శ్రీనివాస్, హుస్నాబాద్ నియోజకవర్గం ఎదులాపురం నవీన్, ప్రధాన కార్యదర్శి తగరం లక్ష్మణ్, ఉపాధ్యక్షులు బొమ్మగాని హరిబాబు, కోఆర్డినేటర్ గడిపి సంపత్, పట్టణ మహిళ అధ్యక్షురాలు కోడూరి శ్రీదేవి, పట్టణ ఉపాధ్యక్షులు ఆషాడం శ్రీనివాస్, మండల ఆర్గనైజేషన్ సెక్రటరీ సంగ ఆంజనేయులు, కోహెడ మండల అధ్యక్షుడు ఆర్. కిషోర్, కన్వీనర్ చొప్పరి సంపత్, అక్కన్నపెల్లి మహేష్ తదితరులు పాల్గొననున్నారు. వివిధ జిల్లాలు, మండలాల నుండి ఎన్ఎచ్ఆర్సి ఎన్జీవో సభ్యులు కూడా హాజరుకానున్నారు.

## విద్యార్థి సంఘాల ఎన్నికలపై చర్చ




**కరీంనగర్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. విద్యార్థి సంఘాల ఎన్నికలు తక్షణమే నిర్వహించేందుకు విధివిధానాలు, మార్గదర్శకాలు రూపొందించాలని వివిధ విద్యార్థి సంఘాల రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టి. స్త్రైలాబ్ (కె.వి.పి.ఎస్), పుట్ట లక్ష్మణ్ (ఏఐఎస్ఎఫ్), కె. పృథ్వి (పి.డి.ఎస్.యు), డా. ఎస్. నాగేశ్వరరావు, అంజి (జార్జి రెడ్డి పి.డి.ఎస్.యు), ఎ. సాంబ (పి.డి.ఎస్.యు), నితీష్, నాగరాజు (ఏఐడిఎస్ఓ), శశాంకర్ (తెలంగాణ యువజన సంఘం), పవన్ (పి.డి.ఎస్.యు), అశోక్ రెడ్డి, కిరణ్ (ఎస్ఎఫ్ఐ), లెనిన్, రమేష్ (ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ), అలాగే హైదరాబాద్ జిల్లా నేతలు నాగేందర్, శ్రీమాన్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాహితి జిల్లా కోశాధికారిగా ప్రముఖ కవి రెబ్బ మల్లికార్జున్ ఎన్నిక

**వలిగొండ, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వలిగొండ పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ కవి రెబ్బ మల్లికార్జున్ యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ సాహితీ సంస్థజిల్లా కోశాధికారిగా ఎన్నికయ్యారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఆనందచారి సమక్షంలో యాదాద్రి జిల్లా కవులందరు సమావేశమై నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. రెబ్బ మల్లికార్జున్ మాట్లాడుతూ తాను కోశాధికారిగా ఉన్నంతకాలం జిల్లా సాహితీ ప్రియులందరికీ ఎల్లవేళలా చేరువుగా ఉండి సంస్థకు తోడ్పాటునందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కవులు జిట్టాభాస్కర్ రెడ్డి, మధుమోహన్, టి ఉప్పలయ్య, గుమిడెల్లి వెంకన్న, నాగభూషణం, ముత్యాలు తదితర జిల్లా కవులందరు పాల్గొని రెబ్బ మల్లికార్జున్ కు అభినందనలు తెలిపారు.

# తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు

**కరీంనగర్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం నేటితో ముగిసింది. చొప్పదండి, గంగాధర, రామడుగు, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లో సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ప్రచారానికి అనుమతి ఇచ్చి, ఆ తర్వాత బహిరంగ ప్రచారాన్ని నిషేధించారు. ఎన్నికల సజావుగా నిర్వహణ కోసం ఈ మండలాల్లో నిషేధాజ్ఞలు అమల్లోకి వచ్చాయి. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని అధికారులు నిషేధించారు. అలాగే ఈరోజు సాయంత్రం 5 గంటల నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు అన్ని మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. పోలింగ్ డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనుంది. అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు చేసి ఫలితాలను ప్రకటించనున్నారు.

# విజయ్ దివస్ వేడుకలు



**కరీంనగర్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మాజీ మంత్రి మరియు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆదేశాలపై నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో విజయ్ దివస్ వేడుకలు తెలంగాణ చౌక్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు హాజరై తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం గులాబీ రంగు గాలి బెలూన్లను ఆకాశంలోకి వదిలారు. తరువాత కోర్టు చౌరస్తాలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు షౌకత్, యువజన ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, నగర బిఆర్ఎస్వి అధ్యక్షుడు బొంకురి మోహన్, ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిక



**అచ్చంపేట, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము బుజ్జి రాములు సమక్షంలో కొమ్ము దానెల్, కొమ్ము నిరంజన్, కొమ్ము రవి, కొమ్ము వెంకటేష్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అడ్డికి సనపతీ రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్మిడి భారత్యయ్య, గ్రామ సీనియర్ అధికారి కొమ్ము దినేష్, ఉపాధి మానసిక ఆలయం డైరెక్టర్ బి. వెంకయ్య, మాజీ డిప్యూటీ సర్పంచ్ కుండం రాములు, గ్రామ ప్రధాన కార్యదర్శి గాని ఆవేక్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ వివాదం



**పెద్దపల్లి, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఓదెల మండలం కొలనూరు గ్రామ సర్పంచ్ స్థానానికి సంబంధించిన రిజర్వేషన్ వివాదం తీవ్ర చర్చనీయాంశమైంది. ఎస్సీ రిజర్వేషన్ కేటాయించిన ఈ స్థానంలో ఎస్సీ మాదిగ వర్గానికి చెందినప్పటికీ క్రైస్తవ మతంలోకి మారిన వ్యక్తి ఎస్సీ సర్టిఫికెట్‌తో నామినేషన్ దాఖలు చేయడం వివాదాస్పదమైంది. గ్రామస్థుడు శంకరయ్య పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతూ, పల్లె కనకయ్య అనే అభ్యర్థి మతం మార్చుకున్నప్పటికీ ఎస్సీ సర్టిఫికెట్‌ను ఉపయోగించి పోటీకి దిగడం నిబంధనలకు విరుద్ధమని ఆరోపించారు. ఈ విషయాన్ని ఆర్డీఓ, ఎంఆర్ఓ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. శంకరయ్య మాట్లాడుతూ, ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే సర్టిఫికెట్‌ను పరిశీలించి నామినేషన్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## మహమ్మదాపూర్‌లో బిఆర్ఎస్ నాయకుల కాంగ్రెస్‌లో చేరిక



**హుస్నాబాద్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో ఈ చేరికలు జరిగాయి. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మాజీ ఉపసర్పంచ్ జిల్లెల తిరుపతిరెడ్డి, గ్రామ శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తుల సమ్మరాజు, నాయకుడు బొల్లితిరుపతి ఉన్నారు. ఈ సందర్భంగా లింగమూర్తి, శివయ్యలు మాట్లాడుతూ డిసెంబర్ 17న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌తో పాటు పది వార్డు సభ్యుల స్థానాలను అధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బంక చందు, గ్రామ శాఖ అధ్యక్షుడు సంగ శ్రీధర్, ఓయూ జెఏసి వైస్ చైర్మన్ గంపల శ్రీనివాస్, ఇన్చార్జి బొంగోని శ్రీనివాస్, పూదరి శ్రీనివాస్, వల్లపు రాజు, ముప్పిడి రాజిరెడ్డి, మామిడి తిరుపతి, మెరుగు వెంకటయ్య, దుద్దెడ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ నుంచి వార్డు నెంబర్ గా నామినేషన్ వేసి బరిలో నిలిచి బిఆర్ఎస్ పార్టీలో చేరిక

**నిడమనూరు డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నిడమనూరు మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన పోతురాజు శీను కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తొమ్మిదవ వార్డ్ అభ్యర్థిగా నామినేషన్ వేసి బరిలో నిలిచి మంగళవారం రోజు ముప్పారం సర్పంచ్ అభ్యర్థి పాల్వాయి వెంకటమ్మ వెంకటేశం ముప్పారం బిఆర్ఎస్ నాయకుల సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు "దరీబ్ లింగప్ప" తాజా మాజీ సర్పంచ్ "అల్లం శ్రీను"అన్నెబోయిన కొండల్ "భాగం జగతి "గణపురం రాంబాబు "మాతంగి కొండల్ "మేకల హనుమయ్య చిత్రం శేఖర్ "మత్రి దుర్గయ్య "గోవర్ధన్ "మునగ యాదయ్య "తరి సైదయ్య "మేకల వెంకటేశం "ఆలంపల్లి వెంకన్న" తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ అభ్యర్థులకు మద్దతు



**హుస్నాబాద్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ నియోజకవర్గంలో జరుగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న విశ్వ బ్రాహ్మణ (విశ్వకర్మ) అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తూ విశ్వకర్మ పరిషత్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎగ్గోజు సుదర్శనాచారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేస్తున్న తమ కుల బాంధవులకు సంఘ నాయకులు, ప్రజలు ఏకమై మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. అభ్యర్థుల విజయానికి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు పార్టీలకు అతీతంగా రోడ్ షోలు, కార్నర్ సమావేశాలు నిర్వహించి ధైర్యాన్ని నింపాలని సూచించారు.చదువుకున్న యువతను రాజకీయాల్లోకి తీసుకురావడం, జాతి శ్రేయస్సు కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సుదర్శనాచారి పిలుపునిచ్చారు.

# అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం


## హక్కుల కోసం ప్రపంచ పిలుపు






**హుస్నాబాద్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
డిసెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1948లో పారిస్‌లో ఐక్యరాజ్యసమితి ఆమోదించిన సార్వత్రిక మానవ హక్కుల ప్రకటనకు ఇది స్మారకదినం. రెండో ప్రపంచ యుద్ధం తెచ్చిన దారుణాలు, మానవ నష్టాలు ప్రపంచాన్ని కదిలించాయి. జీవన హక్కు, సమానత్వం, అభివ్యక్తి స్వేచ్ఛ, వివక్షరహిత జీవనం వంటి 30 ప్రధాన హక్కులను ఈ ప్రకటనలో పరిచయం చేశారు.1950లో ఐరాస తీర్మానం ద్వారా డిసెంబర్ 10ను అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలని అన్ని దేశాలను ఆహ్వానించింది. 1993లో మానవ హక్కుల హై కమిషనర్ వ్యవస్థ స్థాపనతో ఈ కార్యక్రమానికి మరింత బలం చేకూరింది. 2024-25 కాలానికి 'అందరికీ గౌరవం, స్వేచ్ఛ, న్యాయం' అనే నినాదాన్ని ఎంచుకోవడం కూడా ఇదే కారణంతో. భారతదేశం రాజ్యాంగంలోని 21వ అధికరణం ద్వారా జీవన హక్కును స్పష్టంగా రక్షించింది. 1993లో జాతీయ మానవ హక్కుల కమిషన్ ఏర్పడింది. దళితులపై దాడులు, జాతి వివక్ష, బాల కార్మికత్వం, మహిళలపై హింస వంటి సమస్యలు కొనసాగుతున్నప్పటికీ, ప్రజల అవగాహన పెరుగుతోంది. మీడియా, స్వచ్ఛంద సంస్థలు, న్యాయవ్యవస్థ కలిసి పనిచేయడం వలన బాధితులకు న్యాయం అందే మార్గాలు విస్తరించాయి. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, తీవ్రవాదం, మానవ అక్రమ రవాణా, శరణార్థుల సమస్యలు ఇంకా మానవ హక్కుల ఉల్లంఘనలకు కారణమవుతున్నాయి. డిజిటల్ యుగంలో గోప్యతా హక్కు, సైబర్ దాడులు, డేటా దుర్వినియోగం వంటి కొత్త సవాళ్లు కూడా చేరాయి. తెలంగాణలో మానవ హక్కుల కమిషన్ ఇటీవల చురుకైన నిర్ణయాలు తీసుకుంటూ బాధితుల సమస్యలను త్వరితగతిన పరిశీలిస్తోంది. అయితే శిక్ష విధించే అధికారం లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం వంటి పరిమితులు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రజల హక్కులపై అవగాహన పెరిగితేనే ఈ వ్యవస్థ ప్రభావవంతంగా పనిచేస్తుంది. "నాకు ఉన్న హక్కులు ఇతరులకు కూడా ఉన్నాయి" అనే భావన పెరిగినప్పుడే ప్రపంచం నిజమైన శాంతిని అందుకోగలదు. హక్కులు కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదుబీ ప్రతి పౌరుని బాధ్యత. ఇదే అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఇచ్చే ప్రధాన సందేశం.వేల్పుల మహేందర్, కింగ్‌స్టన్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, అధ్యాపకులు

# మెడికల్ కాలేజీకి రెండు బస్సుల ప్రతిపాదన



VAMSI KRISHNA GADDAM
MEMBER OF PARLIAMENT
LOK SABHA
PEDDAPALLI CONSTITUENCY

Ph. No: 8008292924
Date: 24-11-2025

LR No. 889 /24-11-2025/ Delhi

To,
The District Collector,
Mancherial District,
Telangana.

Subject: Request for sanction of ₹80 lakhs from MPLADS funds for procurement of 2 buses for Mancherial Medical College.

Respected Sir,

I am writing to formally request the allocation of ₹80 lakhs from my MP Local Area Development Scheme (MPLADS) funds for the procurement of two buses for Mancherial Medical College.

As per current estimation, the cost of one bus is approximately ₹40 lakhs, and hence a total of ₹80 lakhs is required for the purchase of two buses to facilitate essential transportation support for students and staff.

These buses will greatly assist in:

- Student clinical postings and academic field visits,
- Medical outreach and rural health camps,
- Emergency public health situations,
- Daily movement of students and college staff.

In view of the urgent requirement of this facility for medical education and healthcare activities, I kindly request you to initiate the necessary procedures for sanctioning and releasing ₹80 lakhs from MPLADS at the earliest.

Your prompt action and cooperation in this regard will be sincerely appreciated.

Thank you for your consideration.

Your's sincerely,

Vamsi Krishna Gaddam
MP, Peddapalli Constituency

Office of the District Collector Mancherial HQRS IDOC NASPUR

Member of Consultative Committee for the Ministry of Heavy Industries
Member of Standing Committee - Science and Technology

33, Ferozeshah Road, New Delhi - 110001
Email: vamsi.gaddam@sansad.nic.in, Phone No: 8008292924

**మంచిర్యాల, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంచిర్యాల మెడికల్ కాలేజీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బందికి రవాణా సౌకర్యాలు మెరుగుపరచడానికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ముందడుగు వేశారు. రెండు బస్సుల కొనుగోలుకు 80 లక్షలు ఎంపీ ల్యాండ్స్ నిధుల నుంచి మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కు అధికారిక లేఖ సమర్పించారు.ప్రస్తుతం ఒక్క బస్సు ఖర్చు ?40 లక్షలు కాగా, రెండు బస్సుల కోసం మొత్తం 80 లక్షలు అవసరమని ఎంపీ వివరించారు. ఈ బస్సులు విద్యార్థుల క్లినికల్ పోస్టింగ్స్, అకడమిక్ ఫీల్డ్ విజిట్స్, గ్రామీణ వైద్య శిబిరాలు, అత్యవసర ఆరోగ్య పరిస్థితుల్లో స్పందన, అలాగే రోజువారీ రవాణా సమస్యల పరిష్కారంలో కీలకమని ఆయన పేర్కొన్నారు.మెడికల్ కాలేజీ అభివృద్ధి, శిక్షణా ప్రమాణాల పెంపు, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణలో ఈ సౌకర్యం అత్యవసరమని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు. ఆలస్యం చేయకుండా నిధుల మంజూరు, విడుదల ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# కాంగ్రెస్ విజయమే ఖాయం



**కరీంనగర్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సర్పంచ్ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయం ఖాయమని కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు అన్నారు. మైత్రి హోటల్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి సుపరిపాలన గ్రామాలకు శ్రీరామరక్షగా నిలుస్తోందని, ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఇక కరీంనగర్‌లో కనుమరుగవుతాయని, ప్రజలు వాటిని నమ్మే పరిస్థితి లేదని ఆయన విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలకులు గ్రానైట్ పేరిట కోట్లాది రూపాయల దోపిడీకి పాల్పడ్డారని మండిపడ్డారు. ఇకపై అలాంటి అక్రమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తావివ్వదని, దోపిడీకి పాల్పడిన వారిని తాట తీస్తామని హెచ్చరించారు.రైతు రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, రైతు భరోసా, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందని రాజేందర్ రావు వివరించారు. కొత్తపల్లి మండలంలోని 20 గ్రామాల్లో కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థులను ప్రజలు గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని అత్యధిక సర్పంచ్ స్థానాలను సాధించడం ద్వారా కాంగ్రెస్ శక్తిని మరింత బలపరుస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్ గడ్డను కాంగ్రెస్ అడ్డాగా తీర్చిదిద్దుతామని, సర్పంచ్ నుంచి జెడ్పిటిసి వరకు ప్రతి ఎన్నికలో కాంగ్రెస్ విజయం ఖాయమని వెలిచాల రాజేందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# ఏకగ్రీవంగా సర్పంచ్ ఎన్నిక



**హుస్నాబాద్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మండలంలోని వంగరామయ్యపల్లి గ్రామంలో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి భూక్య రాజేశ్వరి తిరుపతి నాయక్‌ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రత్యర్థి అభ్యర్థి మౌనిక రమేష్ నాయక్ తన నామినేషన్ ఉపసంహరించుకోవడంతో రాజేశ్వరి ఎన్నిక ఏకగ్రీవంగా మారింది. సర్పంచ్‌తో పాటు గ్రామంలోని ఎనిమిది వార్డులను కూడా గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వార్డుల వారీగా లావుడ్య జ్యోతి, బందేల శరత్, యశోద, బోడ రమేష్, లావుడ్య రవీందర్, దుండగుల రాజు, లావుడ్య రమ, సాంకూరి సంగీత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బందెల హరీష్, అనుమాండ్ల శ్రీకాంత్ రెడ్డి, అలాగే బిఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్రామిరెడ్డి, ఎడబోయిన తిరుపతిరెడ్డి, బోడ శ్రీనివాస్, బోడ మోహన్ నాయక్, గ్యామా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి రహిత సమాజమే మనందరి లక్ష్యం



**కరీంనగర్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అవినీతి రహిత సమాజం నిర్మాణమే మనందరి లక్ష్యమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ, ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ పమేలా సత్పతి అవినీతి వ్యతిరేక పోస్టర్‌ను ఆవిష్కరించి, అధికారులు, ఉద్యోగులతో కలిసి అవినీతి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతి నిర్మూలనలో విద్యార్థులు, యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే వెంటనే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది తమ కర్తవ్యాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ కృష్ణ కుమార్, ప్రభుత్వ అధికారులు, ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

# సోనియా గాంధీ జన్మదినోత్సవ వేడుకలు




**కరీంనగర్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జాతీయ కాంగ్రెస్ నేత సోనియా గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. ఇందిరా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను నేతలు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సోనియా గాంధీ దేశ అభ్యున్నతికి విప్లవాత్మక చట్టాలు తీసుకువచ్చి పేద ప్రజలకు ఆహార భద్రత, ఉపాధి హామీ వంటి పథకాలు అందించారని అన్నారు. ప్రధానమంత్రి పదవిని వదులుకుని దేశ ప్రయోజనాలను ముందుకు పెట్టిన నాయకురాలిగా ఆమెను కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి రాష్ట్రాన్ని ఇచ్చిన నాయకురాలిగా సోనియమ్మను ప్రజలు దేవతగా భావిస్తున్నారని నేతలు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిల్లో ప్రార్థనలు, దర్గాల్లో ప్రార్థనలు, రక్తదాన శిబిరాలు, అన్నప్రసాదం కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు విస్తృతంగా పాల్గొని సోనియా గాంధీ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.

# చదువుల తల్లి కి వీహెచ్ఆర్ ఫౌండేషన్ ఆర్థిక చేయూత.



**గోదావరిఖని: డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్దిపేటలోని సురభి మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీట్ దక్కించుకొని ఆర్థికంగా సాయం కోసం ఎదురుచూస్తున్న ఒక దళిత బిడ్డ సౌజన్య కు మంగళవారం మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు చేతుల మీదుగా కాలేజీ ఫీజు కోసం లక్ష యాభై వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర టిఆర్ఎస్ నాయకులు వీహెచ్ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు వ్యాల్ల హరీష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు ఎంబిబిఎస్ విద్యార్థిని సౌజన్య కి శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తులో ఎటువంటి అవసరం ఉన్న సిద్దిపేటలోని తన ఆఫీసులో సంప్రదించమని తెలుపుతూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ డా. ఎర్రోళ్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు అభిలాష్ రంగినేని పాల్గొన్నారు.

# తోటపల్లి గ్రామంలో ఏకగ్రీవంగా సర్పంచ్ ఎన్నిక



**హుస్నాబాద్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామ సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బంక లక్ష్మీ చందు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె భర్త, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బంక చందు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో గ్రామంలో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. 125 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, 4.52 కోట్లతో తోటపల్లి గుడిబండ తారు రోడ్డు, 45.15 కోట్లతో ఏటీసీ సెంటర్, ప్రతి వీధిలో సిసి రోడ్లు, యువత కోసం ఓపెన్ జిమ్, అంగన్వాడీ టాయిలెట్ గది, డ్రైనేజీ వ్యవస్థ, ఎల్ఈడి లైట్లు, ఎనిమిది నీటి నల్లాలు ఏర్పాటు చేశారని వివరించారు. సర్పంచ్‌గా ఎన్నికైన బంక లక్ష్మీ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి రూపాయిని పేదలకు చేరేలా కృషి చేస్తానని, అర్హులందరికీ పెన్షన్లు, రేషన్ కార్డులు అందేలా చూస్తానని తెలిపారు. ఊరి బడిని బాగు చేసి, యువతకు ఉపాధి అవకాశాలు, క్రీడల్లో ప్రోత్సాహం అందిస్తానని చెప్పారు. ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్న గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# శాతవాహన విశ్వవిద్యాలయంలో ఫుట్‌బాల్ సెలక్షన్స్



**కరీంనగర్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ ఫుట్‌బాల్ టోర్నమెంట్ కోసం ఎంపికలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్ జనవరి 5 నుండి 11 వరకు హైదరాబాద్‌లోని వోక్సన్ విశ్వవిద్యాలయంలో జరగనుంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రమాకాంత్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల శారీరక దృఢత్వాన్ని పెంచడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, క్రీడా నైపుణ్యాలతో విశ్వవిద్యాలయానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ నజీముద్దీన్ మునవర్ మాట్లాడుతూ క్రీడాకారులు తమ విశ్వవిద్యాలయాలకు మంచి పేరును తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డా. మనోజ్ కుమార్, పిడి విజయకుమార్, ఫుట్‌బాల్ కోచ్‌లు దినేష్, శ్రీనాథ్, సాబీ, రషీద్‌తో పాటు వివిధ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికల విధుల మినహాయింపు కోసం వినతిపత్రం



**కరీంనగర్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామపంచాయతీ ఎన్నికల విధులు రెండు విడతలుగా కేటాయించబడిన ఉపాధ్యాయులను మూడవ విడత నుండి మినహాయించాలని, అలాగే ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలని కోరుతూ కరీంనగర్ జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు ఊకంటి విజయేందర్ రెడ్డి కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే రెండు విడతలుగా పోలింగ్ విధులు పి.ఓ, ఓ.పి.ఓగా కేటాయించబడిన ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాబట్టి మూడవ విడతలో వారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. పోలింగ్ విధులు ముగిసే సమయానికి అర్ధరాత్రి దాటుతుందని, అందువల్ల మొదటి విడత అనంతరం డిసెంబర్ 12న, రెండో విడత అనంతరం డిసెంబర్ 15న ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికీ ఎన్నికల విధులు కేటాయించబడని ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వడం ద్వారా విధులు సమానంగా ఉండేలా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గడప శేఖర్, రాష్ట్ర ప్రతినిధి దేవిశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత




**కరీంనగర్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు సీపీ గౌస్ ఆలం తెలిపారు. ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం అనంతరం ఆయన ఎన్నికల బందోబస్తు ప్రణాళికను వివరించారు. కమిషనరేట్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో 19 శాతం సున్నితమైనవిగా గుర్తించి అదనపు బలగాలను మోహరించారు. ప్రతి కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ లేదా మైక్రో అబ్జర్వర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో స్టాటిక్ పోలీస్ పార్టీ, మార్గాల్లో రూట్ మొబైల్ పార్టీ, మండలాల వారీగా ఏసీపీ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను సిద్ధం చేశారు. మొత్తం 104 క్లస్టర్లుగా విభజించి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. రాత్రి గస్తీ కోసం ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను అదనంగా కేటాయించారు. ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా ఇప్పటివరకు 132 అక్రమ మద్యం కేసులు నమోదు కాగా, రూ.10.71 లక్షల విలువైన 1447.7 లీటర్ల మద్యం స్వాధీనం చేశారు. కోడ్ ఉల్లంఘన కేసులు 6, నగదు రూ.1 లక్ష స్వాధీనం చేశారు. ఇప్పటికే 5 సర్పంచ్‌లు, 387 వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రౌడీ షీటర్లపై బైండోవర్‌లు పూర్తి చేసి, వారి కదలికలపై నిఘా ఉంచుతున్నట్లు సీపీ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణరావుకు ఘన సన్మానం




**కరీంనగర్, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నీటిపారుదల శాఖ రాష్ట్ర అడహక్ కమిటీ కన్వీనర్‌గా నియమితులైన సంగేం లక్ష్మణరావు పదవిని స్వీకరించిన సందర్భంగా టీఎన్జీవో జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా నుండి రాష్ట్ర స్థాయి కీలక బాధ్యతలు చేపట్టే నాయకులు ఎదగడం టీఎన్జీవో సంఘానికి గర్వకారణమని అన్నారు. గతంలో మారం జగదీశ్వర్ ఇరిగేషన్ శాఖ రాష్ట్ర అధ్యక్షుడిగా చూపిన నాయకత్వం స్థానంలో ఇప్పుడు సంగేం లక్ష్మణరావుకు ఈ అవకాశం రావడం జిల్లాకు ప్రత్యేక గౌరవమని పేర్కొన్నారు. ఆయన క్రమశిక్షణ, సంఘనిబద్ధత, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో చూపిన నిజాయితీ, కృషి వంటి లక్షణాలు ఈ పదవికి అర్హుడిగా నిలబెట్టాయని అన్నారు. ఈ నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, రాష్ట్ర కార్యదర్శి ముజీబ్ హుస్సేన్‌లకు జిల్లా టీఎన్జీవో సంఘం కృతజ్ఞతలు తెలిపింది. కరీంనగర్ జిల్లా ఉద్యమకారులకు, నాయకులకు పుట్టినిల్లు, నాయకులను తయారు చేసే కర్మశాల లాంటిదని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి, మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, ఎడ్ల అరవింద్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, ఓంటేల రవీందర్ రెడ్డి, మారుపాక రాజేష్ భరద్వాజ్, ఇరుమల్ల శారద, సునీత, రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, పోలు కిషన్, నాగరాజు, కోమ్మెర శ్రీనివాస్ రెడ్డి, కామ సతీష్, లవ కుమార్, వెలిచాలా శ్రీనివాసరావు, కరుణాకర్, అజ్గార్ అలీ, శంకర్, జగన్ గౌడ్, కమలాకర్, శంషుద్దీన్, నారాయణ, పూర్ణచందర్, రాజయ్య, విక్రమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్రాబాద్‌లో కాంగ్రెస్ ఏకగ్రీవ విజయం



**అమ్రాబాద్, డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమ్రాబాద్ మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి చిగుర్ల కోటయ్య సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలోని ఎనిమిది వార్డులలో కూడా కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. గ్రామస్తులు ఐక్యతతో తీసుకున్న ఈ నిర్ణయం కాంగ్రెస్ పార్టీపై ప్రజల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. సర్పంచ్‌గా ఎన్నికైన కోటయ్య గ్రామ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# భీమారంలో ఉంగరం గుర్తుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం



**ఫరఖ్‌నగర్, డిసెంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా ఫరఖ్‌నగర్ మండల పరిధిలోని భీమారం గ్రామంలో గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఇ. గీత వీరేషం శుక్రవారం ఉంగరం గుర్తుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధి, తాగునీటి సమస్యలు, రోడ్ల విస్తరణ, హనుమాన్ దేవాలయం అభివృద్ధి, కాలువల నిర్మాణం వంటి అంశాలను ప్రజల ముందుంచి మద్దతు కోరారు. ఈ ప్రచారంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు సహకరించారు. ఎన్నికల్లో ఉంగరం గుర్తుకు తమ మద్దతు అందజేస్తామని గ్రామ ప్రజలు హామీ ఇచ్చారు.

# సిద్దిపేటలో గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి



**సిద్దిపేట, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలోని గజ్వేల్, మర్కుక్, వర్గల్, జగదేవపూర్, ములుగు, దౌలతాబాద్, రాయపోల్ మండలాల పరిధిలో డిసెంబర్ 11న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల మొదటి విడత పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి కే. హైమావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రకటనలో, ఎన్నికల రోజున సంబంధిత మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవు ప్రకటించామని వెల్లడించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే పోలింగ్‌లో గ్రామ ప్రజలు తప్పకుండా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# మహబూబాబాద్ టౌన్‌లో రౌడీషీటర్ల బైండోవర్



**మహబూబాబాద్, డిసెంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పంచాయతీ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మహబూబాబాద్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో పదిమంది రౌడీషీటర్లను ఎమ్మార్వో సమక్షంలో బైండోవర్ చేశారు. ప్రజలు భయం లేకుండా, స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని టౌన్ ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు.

# నాగర్‌కర్నూలులో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ



**నాగర్‌కర్నూలు, డిసెంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నాగర్‌కర్నూలు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు.జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడి అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం లతో కలిసి నూతనంగా నెలకొల్పిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రోహిత్ గోపిడి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్‌లలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ శుభ పరిణామమని అన్నారు. తెలంగాణ తల్లి రాష్ట్ర అస్తిత్వం, ఆత్మగౌరవం, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, ప్రజలలో ఐక్యతను పెంపొందిస్తుందని తెలిపారు. భవిష్యత్ తరాలకు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, విలువలను చేరవేయడానికి ఈ విగ్రహం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూలు జిల్లా ఎస్పీ పోలీస్ స్టేషన్ల సందర్శన



**నాగర్‌కర్నూలు, డిసెంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్‌కర్నూలు జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ మంగళవారం కల్వకుర్తి సబ్ డివిజన్ పరిధిలోని వంగూర్, వెల్దండ, కల్వకుర్తి, ఊర్కొండ పోలీస్ స్టేషన్లను సందర్శించారు. అలాగే కొట్ర ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు.ఎన్నికల సరళి, బందోబస్తు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, బెల్టు షాపులలో మద్యం అమ్మకాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్ల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్శనలో వంగూర్ పోలీస్ స్టేషన్ ఉమెన్ కానిస్టేబుల్ సంధ్యారాణిని ఎన్నికల విధులపై ప్రశ్నించగా, అద్భుతంగా సమాధానం చెప్పినందుకు రివార్డు ప్రపోజల్ పంపాలని ఎస్సైకి సూచించారు.

# మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి



**నల్గొండ, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి సంబంధించిన మూడవ విడత ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా సాధారణ పరిశీలకురాలు ఐఏఎస్ అధికారి కొర్రా లక్ష్మీ సమక్షంలో, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.నల్గొండ, చండూరు డివిజన్లలోని 14 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. చండూరు, చిట్యాల, గట్టుప్పల్, కనగల్, కట్టంగూరు, కేతేపల్లి, మర్రిగూడ, మునుగోడు, నకిరేకల్, నల్గొండ, నాంపల్లి, నార్కెట్‌పల్లి, శాలిగౌరారం, తిప్పర్తి మండలాల్లోని 2870 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయి.ఇందుకోసం పిఓలు, ఓపిఓలు, రెండవ ఓపిఓలు కలిపి మొత్తం 7892 మందిని విధులు నిర్వహించేలా ర్యాండమైజేషన్ చేశారు. వీరిలో పిఓలు 3444, ఓపిఓలు 4448 మంది ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించబడ్డారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు నారాయణ అమిత్, జె. శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పి సీఈఓ శ్రీనివాసరావు, నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్, ఈ-డియం దుర్గారావు, ఎన్ఐసి అధికారి ప్రేమ్ తదితరులు హాజరయ్యారు.

# కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించండి

## ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



**తిమ్మాపూర్, డిసెంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి ఎలుక రాజుతో కలిసి ప్రచారం నిర్వహించారు.గ్రామాభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ముందుకు వచ్చిన యువకులకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. రాజును గెలిపిస్తే రేణికుంట సమగ్ర అభివృద్ధికి తోడ్పడతానని హామీ ఇచ్చారు.ఇప్పటికే గ్రామంలో రూ.6 లక్షలతో ఓపెన్ బావి, రూ.5.60 లక్షలతో స్కూల్ కాంపౌండ్ వాల్, రూ.4 లక్షలతో వంటగది, రూ.3 లక్షలతో హైస్కూల్ మరమ్మతులు, రూ.50 వేలతో క్రీడా సామాగ్రి, రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, రూ.1.50 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశామని వివరించారు. 19 మందికి కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇంటి పథకం కింద 43 ఇండ్లు మంజూరు చేసి 36 ఇండ్లు ప్రగతిలో ఉన్నాయని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులను గెలిపించడం ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని గ్రామస్తులను కోరారు.ఈ ప్రచారంలో పార్టీ నాయకులు శ్రీగిరి రంగారావు, గోపు మల్లారెడ్డి, తమ్మనవేణి రాములు యాదవ్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బోయిని సంపత్ కుమార్, బోనాల కరుణాకర్, వార్డు అభ్యర్థులు, నాయకులు తమ్మనవేణి స్వప్న, కుంబం లక్ష్మి, బి. రాజమణి, బామండ్ల సంపత్, బి. కవిత, జె. సునీల్ రెడ్డి, ఎలుక మహేశ్, బి. తిరుపతి, కుంబం అశోక్, ల్యాగల మల్లారెడ్డి, పోతుగంటి భారతి, పూదరి విజయ, బోయిని రేణుక, నరహరి గోపాల్ రెడ్డి, ఎలుక శ్రీధర్, కోడి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయితీ ఎన్నికల కోసం పటిష్ట భద్రతా ఏర్పాట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్

-సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా
- అదనపు బలగాల మోహరింపు



**నల్లగొండ, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గురువారం మొదటి విడత గ్రామపంచాయతీ ఎలక్షన్లో జరగనున్న నేపథ్యంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఎన్నికలలో ఎలాంటి అవార్చనలు జరగకుండా పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై కఠిన నిఘా 1141 మందికి బైండోవర్ చేసినట్లు తెలిపారు మూడు దశల్లో 869 గ్రామపంచాయతీలలో ఎన్నికలు జరగనుండగా 1680 మంది పోలీసుల తో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలింగ్ కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు నిషేధం విధించినట్లు 163 యాక్ట్ అమలు! కేంద్రాల దగ్గర 4 మందికి మించి గుమికూడరాదని ఓటర్లకు నగదు, మద్యం పంపిణీపై స్పెషల్ విజిలెన్స్ పట్టు బడితే కఠిన చర్యలు తీసుకుంటామని శాంతియుత ఎన్నికలకు ప్రజల సహకారం అత్యంత అవసరం అని విజ్ఞప్తి చేశారు.


# గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

- సర్పంచ్ అభ్యర్థి చిన్నపాక యాదమ్మ జలంధర్



**నల్లగొండ, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామపంచాయతీ మొదటి విడతలో భాగంగా దోరెపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చినపాక యాదమ్మ -జలెంధర్ చివరి రోజు ప్రచారాన్ని కొనసాగించారు దొరెపల్లి గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న పథకాల ఫలాలను గ్రామ ప్రజలకు అందేలా చూస్తానని నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్ల లాంటి ఎన్నో పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానని తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే గ్రామ అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# మోస్ట్ స్టైలిష్ పీపుల్ జాబితాలో షారూక్ ఖాన్



**న్యూఢిల్లీ - డిసెంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బాలీవుడ్ సూపర్‌స్టార్ షారూక్‌ఖాన్‌ను ఈ ఏడాది అత్యంతస్టైలిష్ వ్యక్తుల్లో ఒకరిగా 'న్యూయార్క్ టైమ్స్' పేర్కొన్నది. 67 మంది వ్యక్తులతో విడుదల చేసిన జాబితాలో షారూక్‌ను చేర్చింది. షారూక్ 'మెట్ గాలా' (ఫ్యాషన్, చారిటీ ఈవెంట్)లో విభిన్న దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించినందుకు ఈ గౌరవం దక్కింది.

# కరాటేలో మెరిసిన అశోక్ మెమోరియల్ విద్యార్థులు



**జీడిమెట్ల, డిసెంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానందన్ అశోక్ మెమోరియల్ ఛాణక్య హై స్కూల్ విద్యార్థులను అభినందించారు.ఇటీవల మేరా యువ భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థులు 6 బంగారు, 5 వెండి, 4 కాంస్య పతకాలు సాధించారు. మాస్టర్ ఉదయ్ సార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానందన్ మాట్లాడుతూ పిల్లలు విద్యతోపాటు ఆత్మరక్షణ కళల్లో ప్రావీణ్యం సాధిస్తే శారీరక, మానసిక స్థైర్యం పెరుగుతుందని అన్నారు.అంతర్జాతీయ క్రీడాకారుడు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హెూల్డర్, బంగారు పతక విజేత మాస్టర్ ఏ. నాగరాజు శిక్షణలో ఉన్న విద్యార్థులు ఈ విజయాలు సాధించడం విశేషమని పేర్కొన్నారు.

# మహబూబాబాద్ రూరల్‌లో అభ్యర్థులకు అవగాహన సదస్సు



**మహబూబాబాద్, డిసెంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ రూరల్ మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా చేయవలసిన, చేయకూడని పనులు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేయాల్సిన అవసరాన్ని వివరించారు.ఎన్నికల దృష్ట్యా ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, పెట్రోలింగ్ పార్టీల ద్వారా అన్ని గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా సాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తిరుపతి రావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు, రూరల్ సీఐ సర్వయ్య, తహసిల్దార్ చంద్ర రాజేశ్వరరావు, కురవి ఎస్సై సతీష్, రూరల్ ఎస్సైలు దీపిక, రవికిరణ్, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహబూబాబాద్ కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ



**మహబూబాబాద్, డిసెంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఆవిష్కరించారు.10 అడుగుల ఎత్తులో విగ్రహం, 4 అడుగుల బేస్‌మెంట్, 2 అడుగుల పీఠంతో కలిపి మొత్తం 16 అడుగుల ఎత్తులో విగ్రహం నిర్మించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో (రెవెన్యూ), కె. అనిల్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ భీమ్లా నాయక్, జిల్లా అధికారులు, పరిపాలన అధికారి పవన్ కుమార్, కలెక్టరేట్ అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# సప్తగిరి ఇండస్ట్రీస్ మిల్లు అవకతవకలపై విచారణ జరపాలి

**-రైతుల ధాన్యం సేకరణలో నిలువు దోపిడీ చేస్తున్నమిల్లు వ్యాపారి**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్**



**జమ్మికుంట డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** రైతుల నుంచి ధాన్యం సేకరణ విషయంలో జమ్మికుంటలోని సప్తగిరి మిల్లులో చేస్తున్న నిలువు దోపిడీ, అవకతవకలపై ఉన్నతస్థాయిలో విచారణ జరపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మికుంట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పంజాల శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లలో భాగంగా రైతుల ద్వారా ఐకెపి కేంద్రాల నుంచి సేకరించిన వడ్లను అలాట్ మెంట్ చేసిన జమ్మికుంట సప్తగిరి ఇండస్ట్రీస్ మిల్లులో దోపిడీకి పాల్పడుతూ సదరు మిల్లు వ్యాపారి లబ్దిపొందుతున్నాడని ఆరోపించారు. వారికి కేటాయించిన ఐకెపి ద్వారా రైతుల నుంచి సేకరించిన ధాన్యంలో తేమ, తాలు, తప్ప వంటి లోటు పాట్లను ఆసరాగా చేసుకుంటూ రైతులను తీవ్రంగా దోపిడీ చేశారని పేర్కొన్నారు. సదరు సప్తగిరి ఇండస్ట్రీస్ మిల్లులో ఐకెపి కేటాయించిన ధాన్యానికి, మిల్లు ద్వారా చూపించిన ట్రక్ షీట్ లో భారీగా వ్యత్యాసం చూపిస్తూ రైతులను నిలువు దోపిడీ చేశారని తెలిపారు. ఒక్కో రైతుల నుంచి 10,20, 30 ఇలా క్వింటాళ్ల కొద్ది వ్యత్యాసం చూపించి సదరు మిల్లు వ్యాపారి భారీ దోపిడీకి పాల్పడ్డారని పేర్కొన్నారు. అటు ఐకెపి కేంద్రాల నిర్వాహకులను, ఇటు అధికారుల కనుసన్నల్లోనే దోపిడీ జరిగిందని బలమైన అనుమానం కలుగుతోందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, పెట్టుబడుల భారంతో చెమటోడ్చి పండించిన పంటను అమ్ముకుందామన్నా రైతులకు కష్టాలు తప్పడం లేదన్నారు. ఐకెపి కేంద్రాల్లో వడ్లు ఆరబోసి తేమ శాతం వచ్చిన తర్వాత జరిగిన కొనుగోళ్ల అనంతరం మిల్లులకు చేరవేసేదాక రైతులకు తిప్పలు తప్పడం లేదన్నారు. రోజుల తరబడి ఆరబోసి వానదేవుడిని ప్రార్థించుకున్న పంట విక్రయించుకున్న తర్వాత రైతుకు కనీస మద్దతు ధర దక్కడం గగనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లుల వ్యాపారులు ప్రభుత్వాన్ని, అధికారులను శాసించే విధంగా వ్యవహరించినా చర్యలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. సదరు సప్తగిరి మిల్లు గతంలో వడ్లను మరాడించి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని సకాలంలో ఇవ్వకున్నా చర్యలు కానరాలేదనికోట్లాది రూపాయలలో బ్యాంకు గ్యారంటీలు చెల్లిస్తూ రైతులను నిలువు దోపిడీ దందా కొనసాగిస్తున్నారని అన్నారు. అందుకు కొంత మంది అధికారులు సైతం మద్దతిస్తున్నారని ఆరోపించారు. సదరు సప్తగిరి ఇండస్ట్రీస్ రైస్ మిల్లు వ్యాపారి ధాన్యం కేటాయింపుల విషయంలో అధికారులకు సరైన పూచీకత్తులు ఇవ్వకున్నా దందా యధేచ్ఛగా సాగించాడని, వందలాది మంది రైతుల వద్ద నుంచి పెద్ద మొత్తంలో జరిగిన ఈ దోపిడీని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పంజాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జమ్మికుంట మండల కార్యదర్శి గజ్జి ఐలయ్య, వీణవంక మండల కార్యదర్శి రాంగోపాల్, సమ్మయ్య పాల్గొన్నారు.

## తిప్పర్తి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి శ్రీమతి బద్దం రజిత సుధీర్ గారి గెలుపు కోరుతూ భారీ ర్యాలీ



**నల్లగొండ, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మంగళవారం ఉదయం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బ్రహ్మాండమైన బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాదిమంది యువకులు బైకులతో పాత గ్రామపంచాయతీ, మజీదు, పాత తిప్పర్తి, సైదు బావి గూడెం, తిప్పలమ్మ గూడెం నుంచి తిప్పర్తి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం మధ్యాహ్నం తిప్పర్తి బస్టాండ్ సెంటర్ లో బహిరంగ సభ నిర్వహించారు అధిక సంఖ్యలో హాజరైన ప్రజలను ఉద్దేశించి వక్తలు ప్రసంగిస్తూ బద్దం సుధీర్ గత కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న తిప్పర్తి అభివృద్ధి, సామాజిక సేవను గుర్తించి గెలిపించవలసిందిగా కోరారు ఉన్నత విద్యావంతురాలైన రజితను గ్రామ ప్రథమ పౌరురాలిగా ఎన్ని కోవాలని సూచించారు. గురువారం నాడు జరగనున్న పోలింగ్ లో ఉంగరం గుర్తుపై ఓటు వేసి శ్రీమతి బద్దం రజిత సుధీర్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. మంత్రి కోమటిరెడ్డి సహకారంతో బద్దం రజిత సుధీర్ గ్రామ అభివృద్ధి కి విశేష కృషి చేయగలరని అన్నారు. ముఖ్య అతిథిగా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి గారు మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ గారు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు తిప్పర్తి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహబూబాబాద్ రూరల్‌లో ఫ్లాగ్ మార్చ్



**మహబూబాబాద్, డిసెంబర్ 9(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు రూరల్ మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన సింగారం, విఎస్ లక్ష్మీపురంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్ఐలు సతీష్, జయకుమార్, రూరల్ ఎస్సైలు దీపిక, రవికిరణ్, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, కురవి పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎలిగేడు గ్రామపంచాయతీ నలుగురు వార్డు సభ్యులు ఏకగ్రీవం.


న్యాతరి.పోచయ్య మూడవ వార్డు


మామిడాల రమేష్ ఏడవ వార్డు


ముంజంపల్లి కవిత ఐదవ వార్డు


తంగేళ్ల శ్రీలత 9వ వార్డు

**ఎలిగేడు, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** గ్రామపంచాయతీ లోని 12 వార్డులలో నాలుగు వార్డుల అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. న్యాతరి పోచయ్య(3వ వార్డు), ముంజాంపల్లి కవిత(5వ), మామిడాల రమేష్(7వ), తంగెళ్ల శ్రీలత(9వ)లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విజయానికి దోహదం చేసిన నాయకులకు, ప్రజలకు కృతజ్ఞలు తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల అథ్లెటిక్ విజయాలు



**హయత్‌నగర్, డిసెంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన సింథటిక్ ట్రాక్ అథ్లెటిక్ టోర్నమెంట్‌లో హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం ఆరు పతకాలు సాధించారు. బి.ఎ. రెండవ సంవత్సరం విద్యార్థి ధోని 5000 మీటర్ల పరుగులో మొదటి స్థానం, 1500 మీటర్ల పరుగులో రెండవ స్థానం సాధించి జనవరి 2026లో బెంగళూరులో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్ మీట్‌కు అర్హత పొందాడు. బి.కాం. మొదటి సంవత్సరం విద్యార్థిని ఎన్. సౌమ్య 10000 మీటర్ల పరుగులో రెండవ స్థానం, బి.ఎస్.సి. మొదటి సంవత్సరం విద్యార్థిని కె. బిందు 800 మీటర్లలో మొదటి స్థానం, 400 మీటర్లలో రెండవ స్థానం సాధించారు. అదనంగా బి.కాం. మొదటి సంవత్సరం విద్యార్థి భాను ప్రసాద్ 400 మీటర్ల పురుషుల విభాగంలో మూడవ స్థానం సాధించాడు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ బాబు విద్యార్థులను సత్కరించి అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె. అనితకు నిరంతర మద్దతు, ప్రోత్సాహం అందించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, ఐక్యూఏఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మధు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింహ, లైబ్రేరియన్ డాక్టర్ దుర్గాప్రసాద్, అధ్యాపకులు మరియు సిబ్బంది పతక విజేతలను అభినందించారు.

## కంపెనీ మేనేజర్ని నమ్మితే లక్షలు కొల్లగొట్టాడు

**-షాద్‌నగర్ పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసిన నిజం**
**-రూ.7.5 లక్షలు రికవరీ**
**-మీడియా సమావేశంలో ఏసీపీ లక్ష్మీనారాయణ వెల్లడి**
**-కటకటాల పాలైన మేనేజర్**






**షాద్ నగర్, డిసెంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)** అమాయకంగా కనిపిస్తూ యజమాని నమ్మకాన్ని దోచుకున్న కంపెనీ మేనేజర్ చివరకు పోలీసుల వలలో చిక్కాడు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఫరూక్‌నగర్ మండలం ఎలుకట్ట శివారులోని దుర్గా స్టీల్ కంపెనీ యజమాని రాజ్‌కుమార్ ఈ నెల 3న కంపెనీ మేనేజర్ కమల్‌కిషోర్‌కు రూ. 7.5 లక్షలు అప్పగించారు. నగదును టేబుల్ డెస్క్‌లో లాక్ చేసిన తర్వాత మరుసటి రోజు మేనేజర్ నగదు కనిపించడం లేదని చెప్పాడు. డబ్బులతో పాటు కంపెనీ డివిఆర్ కూడా అదృశ్యమైంది. ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపి కమల్‌కిషోర్ వర్మను అరెస్టు చేశారు. మరో కార్మికుడు బబ్లు ద్వారా తాళం చెవి తీసుకొని నగదు తస్కరించినట్లు బయటపడింది. పోలీసులు ఆధారాలతో నిందితుడిని పట్టుకొని రూ. 7.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ విజయకుమార్, డీఐ వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బందిని అభినందించారు. కేసు పురోగతికి కృషి చేసిన సిబ్బందికి రివార్డు సిఫార్సు చేస్తామని ఏసీపీ వెల్లడించారు.

## వెల్దండలో కాంగ్రెస్ పార్టీ రోడ్ షో





**వెల్దండ, డిసెంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సర్పంచ్ అభ్యర్థి మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్యతో కలిసి కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్ షో నిర్వహించారు. మహిళా కార్యకర్తలు యాదమ్మను వెల్దండ సర్పంచిగా రికార్డు సృష్టించాలని ఆకాంక్షించారు. కార్యకర్తలు మేమున్నామంటూ ముందుకు వచ్చి, మా అన్నయ్య లోటును తీర్చిన యాదమ్మ, వెంకటయ్య విజయ బాగుంట ఎగురవేయాలని ఆశీర్వదించారు. కోట మైసమ్మ అమ్మవారి ఆశీర్వాదం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కోట మైసమ్మ అమ్మవారి ప్రాంగణంలో యాదమ్మ, వెంకటయ్య గౌడ్ వార్డు సభ్యులను పరిచయం చేస్తూ వారి గుర్తులను ప్రజలకు వివరించారు. మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం ప్రజలకు వివరించారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానాలు ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలకు మేలు చేస్తున్నాయని, జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలు దానికి నిదర్శనమని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి యాదమ్మ, వెంకటయ్యతో పాటు 14 మంది వార్డు సభ్యులను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ యాదవ్, యెన్నం భూపతిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, మండల పట్టణ అధ్యక్షుడు ఎర్ర శీను, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రమేష్, ఎండి రషీద్, పురుషోత్తం, కాషారపు వెంకటయ్య, భయ్యా మల్లయ్య, గోరేటి కృపానందం తదితరులు పాల్గొన్నారు.